గ్యాస్ రాయితీకి ఎదురుచూపు!

ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా ఉన్నా.. ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

- మహాలక్ష్మి పథకం కింద 79,553 మంది లబ్ధిదారులు
- జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు 4.54 లక్షలు
- 15 మండలాల్లో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 14.48 లక్షలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆసరాగా ఉండేందుకు వంటగ్యాస్ సిలిండర్ రూ.500 ఇవ్వాలన్న ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించింది. రాయితీ సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. సమస్యల నివృత్తికి ప్రత్యేకంగా ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం అంతగా కనిపించడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని మహిళలు గ్యాస్‌పై రాయితీ వస్తుందన్న ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరడంలేదని ఆందోళన చెందుతున్నారు.

కేంద్రం రాయితీ ఓకే.. మరి రాష్ట్రానిది

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.874 ఉండగా.. కేంద్రం రాయితీ రూ.47, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.328 పోగా, రూ.500కు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్‌ను పొందాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వినియోగదారుడి ఖాతాతో వారంలోగా జమ అవుతుండగా.. రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

◆ పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం తిరుగుతున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వంటివి అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆందోళన అవసరం లేదు..

రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానం, తదితర కారణాలతో రాయితీ జమకాకుండా ఉండొచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా పౌరసరఫరాలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సిలిండర్ తీసుకున్న తర్వాత 4 రోజుల్లో రాయితీ జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. కానీ దీనిపై ఎలాంటి స్పష్టత లేదని పలువురి వాదన.

గ్యాస్ కనెక్షన్లు ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తంగా 14,48,889 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో డబుల్ గ్యాస్ కనెక్షన్లు 8,52,468, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 5,11,324, దీపం కనెక్షన్లు 70,869, ఉజ్వల కనెక్షన్లు 2,593, కమర్షియల్ కనెక్షన్లు 11,635 ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద 77,553 మంది లబ్ధిదారులు ఉన్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 4,54,859 సిలిండర్లు తీసుకున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ . 14.32 కోట్ల రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది.

అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ..

రాష్ట్రం నుంచి సొమ్ము ఎందుకు.. ? జమ కావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ఎదురు చూస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ.. ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయితీ వచ్చినా జమకాని సొమ్ము

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇచ్చే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకావడం లేదని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా కార్యాలయానికి వెళ్లి అడిగితే రాయితీ వచ్చిందని చెబుతున్నారని పేర్కొంటున్నారు. బ్యాంకులో అడిగితే రాలేదంటున్నారని, ఎందుకు..? జమ కావడం లేదో తెలియడం లేదంటున్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సిండికేట్ బ్యాంక్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే అరకొర నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి అనేదే లేకుండా పోయిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశా నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, మన్నె ఉదయ్ యాదవ్, మక్కాల నర్సింగ్‌రావు, మేకల హరినాథ్ మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, చందుయాదవ్, అరవింద్, భాస్కర్, భిక్షపతి, భారతమ్మ, సూర్య ప్రకాశ్‌రెడ్డి, ప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభావతి, సంధ్యారాణి, జగదీష్, పెద్దిరాజు మురళీమనోహర్, విజయకుమార్ కాలనీవాసులు మైపాల్ రెడ్డి, కృష్ణయ్య, సత్యమూర్తి, మాధవరెడ్డి, బాలయ్య, మల్లేశ్‌యాదవ్, బుర్రి యాదగిరి, మట్టి శ్రీను, పిట్ల రాజు, నగేశ్, కృష్ణారెడ్డి, రాజుగౌడ్, శ్యామ్ మోహన్, మహేశ్, ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో 'వ్యాన' ఆవిష్కరణ



వ్యానను ఆవిష్కరించిన నిర్వాహకులు, వినియోగదారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో రత్నాభరణాల సేకరణ అయిన వ్యానను ఆదివారం ఆవిష్కరించింది. వజ్రంతో ప్రేరేపితమైన తేజస్సును, వర్ణరంజితమైన, శక్తివంతమైన రత్నాలను, 18, 22 క్యారెట్ల బంగారంతో వ్యానను సుందరంగా రూపొందించారు. ట్రెండీగా, బోల్డ్‌గా, సులభంగా ధరించగలిగే ఫ్లూయిడ్, తేలికైన సిల్హౌట్‌లు ఈ సేకరణలో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌లో సొగసైన వ్యాన కలెక్షన్‌తో పాటు, అద్భుతమైన రత్నాలు, అన్‌కట్ వజ్రాలతో కూడిన సాంప్రదాయ ఆభరణాల సేకరణను ప్రదర్శిస్తుందన్నారు. అన్ని రకాల రత్నాలు, అన్‌కట్ వజ్రాల ఆభరణాల తరుగు చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు ఉంటుందని, ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 7 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు.

మల్టీ జనరేషన్ పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో రూ.3కోట్ల 61లక్షలతో చేపట్టిన మల్టీ జనరేషన్ పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మయూరినగర్‌లో సకల సౌకర్యాలతో పార్కును కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే సులువుగా రాకపోకలు జరిగేలా సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లో నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించేందుకు, దొరల అరాచకాలు, దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో ముద్దాపురం మాదన్‌గౌడ్, దేవేందర్‌నగర్ నూతన గౌడ సంఘం అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, వెండి రవి, ప్రభాకర్ గౌడ్, రవి కుమార్ గౌడ్, సత్యప్రకాశ్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

24న మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గం: దేశంలోనే అతిపెద్ద రక్తదాన శిబిరం-2025ను గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ క్యాంపస్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24వ తేదీ ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. 18 ఏళ్లు పైబడి వారు, ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయడానికి ముందుకురావాలని నిర్వాహకులు కోరుతున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9396503335, 040–23001234లలో సంప్రదించాలి.

82 మంది వాహనదారులపై కేసు

కుత్బుల్లాపూర్: బాలానగర్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 82 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అల్వాల్, జీడిమెట్ల, బాలానగర్, మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లతో పాటు డంక్రన్ డ్రైవ్‌లు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ బాలానగర్‌లో 24 మంది, జీడిమెట్ల పీఎస్ పరిధిలో 20, అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 20, మేడ్చల్ ట్రాఫిక్ పరిధిలో 18 మంది వాహనదారులు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు.

రసోల్లాస్ నృత్యోత్సవం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ గురువు డాక్టర్ రమాదేవి రసోల్లాస్ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. భరతనాట్య ప్రదర్శనలో దెబ్జాని చటర్జీ మీరా భజన, ఠాగూర్ సంగీత గీతం, డాక్టర్ మధుసూదన్ భరతాంజలి కేరళ నటనం ప్రదర్శనలో కృష్ణగాథ, శ్రీరామచంద్ర కృప అంశాలను ప్రదర్శించారు. భరతనాట్య ప్రదర్శనలో శబ్దం, తిల్లాన అంశాలను ఎస్ రమ్య ప్రదీప్ ,డాక్టర్ అతిరా, సౌమ్య రామస్వామి.. కృష్ణ జననశబ్దం, కళింగ తిల్లాన అంశాలను ప్రదర్శించారు. నాట్యకళా కుశల సాగర అవార్డు 2025ని పియాల్ భట్టాచార్యకి ఇచ్చి సత్కరించారు. ఎస్‌పి భారతి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

నవ వధువుకు ఆర్థిక సాయం

జీడిమెట్ల: విశ్వ ఎంపవర్‌మెంట్ అండ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (వెస్సో) వారు ఓ నిరుపేద నవ వధువు కుటుంబానికి అండగా నిలిచారు. సుభాష్‌నగర్‌కు చెందిన మసంగారు రామకృష్ణ చారి ఓ సంస్థలో హెల్పర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె వివాహం ఈనెల 10న జరిగింది. అయితే వారిది నిరుపేద కుటుంబం కావడంతో రామకృష్ణ చారి కుత్బుల్లాపూర్ వెస్సో ఆర్గనైజేషన్ సభ్యులను ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ సంఘం సభ్యులు ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి నవ వధువు తండ్రికి ఆదివారం రూ.45 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బంగారు తాతారావు దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నియామకం



కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు కల్యాణి దుర్గా ప్రసాద్ రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా తీజ్ వేడుకలు

కూకట్‌పల్లి: మియాపూర్ డివిజన్ నడిగడ్డ తండాలో ఆదివారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరుకాగా సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అలాగే ఎమ్మెల్యే వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక మండపానికి కర్ర పూజ



కర్ర పూజ చేస్తున్న అధ్యక్షుడు పురేందర్ రెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలోని వినాయక మండపానికి ఆదివారం కర్ర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఎస్. శ్రీధర్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, జలంధర్ రెడ్డి, గణేశ్ యూత్ కమిటీ సభ్యులు భార్గవ్, నందు, రిత్విక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన జబీన్ భీరంగూడ షాపింగ్‌మాల్ లిఫ్ట్‌లో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతోంది. అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూరు ఆదివారం బాధితురాలిని పరామర్శించి హాస్పిటల్ ఖర్చుల కోసం యశ్వంత్ ద్వారా విరాళం అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి, ప్రశాంత్, సురేంద్ర, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్ చౌరస్తా మురుగుమయం..!



పర్వత్‌నగర్ చౌరస్తాలో పొంగుతున్న డ్రైనేజీ నీరు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తా దుర్గా మల్లేశ్వరి దేవాలయం సమీపంలో కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



కుత్బుల్లాపూర్‌లో నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

కుత్బుల్లాపూర్: మాజీ మున్సిపల్ చైర్మన్ కేఎం పాండు 81వ జయంతిని జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్‌లోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయం, చింతల్ ప్రధాన రోడ్డులోని పాండు విగ్రహాలకు అభిమానులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ గ్రామ అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, విద్యాభివృద్ధికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి పాండు అని కొనియాడారు.

శివాలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీకాలనీ: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి డివిజన్‌లోని వసంత్‌నగర్ కాలనీలో శివాలయం పునర్నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వసంత్‌నగర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

నవగ్రహాల ప్రతిష్ఠ

కూకట్‌పల్లి: పాత శివాలయంలో నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం జరిగింది. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు, తులసీరావుతో కలిసి నవగ్రహాలకు పూజలు చేశారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



ఆల్విన్‌కాలనీ: వాంబేకాలనీలో డ్రైనేజీ పైపులైన్ పగిలి నీరు రోడ్లపై పారుతూ ఇళ్లల్లోకి చేరుతోంది. ఈ విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె ఎక్కిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నర్సింహ, అరవింద్, మున్నీర్, రవి, స్వామి, సాగర్ రాజు, పాషా, వాజిద్, వరలక్ష్మి, అస్మ, పాష, కాలనీవాసులు పాల్గొన్నారు.

బురద తొలగింపు



రైల్వేట్రాక్ సమీపంలో చెత్తాచెదారం, బురద



సాక్షి ఎఫెక్ట్..

చెత్తాచెదారం, బురదను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

కొత్తూరు సీతయ్యనగర్‌లో రైల్వే ట్రాక్ పక్కన 'చెత్తాచెదారంతో పాటు బురద' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మూసాపేట జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఎస్ఆర్‌పీ వద్ద సురేశ్‌చారి పర్యవేక్షణలో ఆదివారం బురదను తొలగించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

– మోతీనగర్

నాణ్యమైన పనులు చేపట్టాలి



శ్మశాన వాటికలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్టియన్ శ్మశానవాటికలో మొక్కలు నాటాలని యూబీడీ అధికారులకు సూచించారు. అలాగే హిందూ శ్మశాన వాటికలో బర్నింగ్ ప్లాట్ ఫాం, సిట్టింగ్ గ్యాలరీ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంతిమయాత్రలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతులు కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పీ ఇశ్రాయిల్, ఎం. సత్యరాజు, ఎం. దేవదాస్, సుమన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, యూబీడీ సూపర్‌వైజర్ నాగరాణి పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాకు తరలిన నాయకులు



ఆల్విన్‌కాలనీ: ఈడబ్ల్యూఎస్ కమిషన్, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టింగారి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 36 గంటల ధర్నా కార్యక్రమానికి పాపిరెడ్డినగర్ నుంచి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జాగృతి అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గంలో ఉన్నవారిలో 90 శాతం పేదవారే ఉన్నారని, వారి కోసం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా ఆడబ్ల్యూఎస్ కమిషన్ జాతీయస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో చర్ల రామకృష్ణారెడ్డి, ఏసీ రెడ్డి, భూపాల్ రెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, దొడ్ల రామిరెడ్డి, గంగుల రాజిరెడ్డి, కార్ల తిరుపతి రెడ్డి, ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, తడికల రాజిరెడ్డి, డాకురి అక్కిరెడ్డి, ఏసీ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ బోర్డు మాయం!



సర్వే నంబర్ 346లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



ఈ నెల 15న ఉదయం బోర్డు లేని స్థలం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తెల్లారేసరికే తొలగించారు. గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లోని సర్వే నంబర్ 346 లోని 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కేటాయించింది. అయితే కోట్లు విలువ చేసే సదరు స్థలంపై కొంతమంది కన్ను పడడంతో ఈనెల 14న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే బోర్డును తెల్లారేసరికి కొంతమంది మాయం చేశారు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీంను 'సాక్షి' వివరణ కోరగా బోర్డు తొలగించిన విషయం తమ దృష్టికి వచ్చిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారులతో కలిసి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



కుత్బుల్లాపూర్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లో, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్థానికులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రామాచారి పేర్కొన్నారు.